సాక్షి కర్నూలు

సోమవారం : 3 : జూన్ : 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్ : నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కర్ణాటక సింధనూరుకు చెందిన శర్వారి దేవి రెడ్డి రూ.1,11,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఫణీధర ప్రసాద్‌కి అందజేశారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి పూజలు నిర్వహించారు.

శ్రీశైలంలో హీరో శర్వానంద్



శ్రీశైలం టెంపుల్: సినీ హీరో శర్వానంద్ ఆదివారం శ్రీశైలం వచ్చారు. శ్రీ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

న్యూస్‌రీల్

శ్రీగిరి కిటకిట



మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రంలో వారాంతపు రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి బారులు తీరారు. దీంతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

మూడు వైద్యశిబిరాల ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించే రాయలసీమ యూనివర్సిటీలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ తెలిపారు. కౌంటింగ్ జరిగే మొత్తం మూడు బ్రాంచుల్లో మూడు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో వైద్యశిబిరంలో ఒక డాక్టర్, ఒక నర్సు, ఒక వార్డు బాయ్‌తో పాటు అవసరమైన మందులు ఉంటాయన్నారు. దీంతో పాటు అదనంగా ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, రెండు పడకలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవ్వరికైనా అత్యవసర వైద్యం అవసరమైతే ఇక్కడ చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

జీవాల్లో చిటుకు రోగ నివారణకు వ్యాక్సిన్

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకల్లో చిటుకు రోగం(ఈటీ) నివారణకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం మొదలైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 19 లక్షల డోసులు వ్యాక్సిన్ సరఫరా అయ్యింది. కర్నూలు జిల్లాకు 9.50 లక్షలు, నంద్యాల జిల్లాకు 9.50 లక్షల డోసులు సరఫరా చేసినట్లు కర్నూలులోని పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు. వానాకాలం మొదట్లో కురిసే వర్షాలకు మొలకెత్తిన గడ్డి తినడం వల్ల చిటుకు రోగం వ్యాపిస్తుందని, కొత్తగా మొలకెత్తిన మొక్కల్లో విషపూరిత బ్యాక్టీరియా ఉంటుందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా వ్యాక్సిన్ వేస్తే గొర్రెలు, మేకల్లో రోగ నిరోధక శక్తిపెరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి సంస్కృత సంభాషణ శిబిరం

కర్నూలు కల్చరల్: సంస్కృత భారతి, గీతా మందిరం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి పది రోజుల పాటు కర్నూలులో సంస్కృత సంభాషణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఓల్డ్‌సిటీలోని గీతా మందిరంలో ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9 గంటలకు వరకు సంస్కృత భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సంస్కృతంలో మాట్లాడటం నేర్చుకోవాలనే అభిలాష ఉన్న ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా శిక్షణలో పాల్గొన వచ్చని తెలిపారు.

కల్తీ కలవరం

ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి.. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ఇంటి భోజనం కంటే హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు చాలా మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదే ప్రధాన సమస్యగా మారుతోంది. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు తిని రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది కల్తీ ఆహారంతోనే సమస్య తెచ్చుకున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజెబుతోంది.



- బయట దొరకని నాణ్యమైన ఆహారం
- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచికోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- స్వాగతం పలుకుతున్న సరికొత్త రోగాలు
- హోటళ్లలో అధికారుల నామమాత్రపు తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్)/కర్నూలు(టౌన్): పాతికేళ్ల క్రితం వరకు ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు ఉన్నప్పుడే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునే వారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యంగానూ మంచి లక్షణమే. ఇప్పుడు 'కల్చర్' మారింది. 'సోషియల్ బిహేవియర్'లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా 'పార్టీ కల్చర్' వచ్చింది. బర్త్‌డే, మ్యారేజ్‌డే, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్...సందర్భం ఏదైనా 'పార్టీలు' ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు కాని, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటివల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధులబారిన పడే ప్రమాదం ఉంది.

ఇవి ప్రమాదకరం

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధం. కానీ వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతుంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులు వస్తాయి.
- వంటకాల్లో రంగుకోసం వాడే నిషేధిత టార్‌ట్రాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యథ, థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణజాలంలో హానికర కణజాలాల వృద్ధి చెందడం, డీఎన్‌ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాట్రాజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్టాజిన్‌లు ప్రమాదకరమే!



- చాక్లెట్లలో వాడే రోడ్‌మస్–బి కూడా ప్రాణాంతకమే! అయినా చాక్లెట్లు, చిన్నపిల్లలు తినే రంగుల ఆహారపదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెస్టారెంట్లు, బేకరీ ఆహారాన్ని వరుసగా 40రోజులు తింటే కీళ్లనొప్పులు, జీర్ణసంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

నిబంధనలు బేఖాతర్

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, డాబాలు, చాట్, నూడుల్ షాపులు అన్ని కలుపుకుని 7 వేలకు పైగా ఉంటాయి. ఒక్క కర్నూలు నగరంలోనే 1,500 దాకా హోటల్స్ ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలని ఉంది. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ ఇవి జరగడం లేదు. ఇంత పెద్ద జిల్లాలో కేవలం 12 శాంపిల్స్ తీసి ఊరుకుంటే మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? దీన్ని ఆసరగా చేసుకుని తమ వద్దకు ఎవ్వరూ రారన్న ధీమాతో వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.

అనుమతిలేని వ్యాపారాలు

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగు కాల్వలు, చెత్తకుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు.

నామమాత్రంగా తనిఖీలు

జిల్లాలో ఏడాదికి 360 శ్యాంపిల్స్ అధికారులు తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు జిల్లాలో నెలకు 12 శాంపిల్స్ మాత్రమే తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఇందులో ఒక్కో నెల కేవలం రెండు, మూడు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. సీజన్‌ను బట్టి పండ్ల దుకాణాలపైనా నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. కల్తీ జరిగిన, ఆహారాల్లో రంగులు వేసిన పదార్థాలకు నాన్ స్టాండర్డ్ పేరిట ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే వారికి నామమాత్రపు జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు.

కల్తీ జరుగుతుంది ఇలా..

- పాలల్లో మున్సిపల్ కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టును మిశ్రమం చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడైపోయే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో ఆకట్టుకునేందుకు గాను ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేడు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీనివల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం అక్రమార్కులు కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండటంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.

నెలకు 12 శాంపిల్స్ తీస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా తప్పనిసరిగా 12 శాంపిల్స్ సేకరించి పంపిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా ఆహారంలో కల్తీ జరిగిందని తెలిసి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే అక్కడకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో చూసి కల్తీ ఎక్కువగా జరుగుతోందని భావిస్తున్నారు. ఎక్కడో కొన్ని చోట్ల అలా జరగవచ్చు గానీ ప్రతిచోటా అలా జరగదు. ఎవ్వరికైనా అనుమానం వస్తే బి.క్యాంపులోని మా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

–కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, కర్నూలు

జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు

- ఆర్‌యూకు 2 కిలోమీటర్ల పరిధిలోని షాపులన్నీ మూసివేత

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తుండడంతో ప్రశాంత వాతావరణం కోసం జిల్లా అంతటా 144 సెక్షన్ విధిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కడా ఐదుగురు వ్యక్తులకు మించి ఒకే చోట గుమిగూడరాదని, బహిరంగ సభలు నిర్వహించకూడదని తెలిపారు. జూన్ 4వ తేదీన రాయలసీమ యూనివర్సిటీ నుంచి 2 కిలోమీటర్ల దూరం వరకు ఉండే హోటళ్లు, పార్కులు, విద్యా సంస్థలు, ఇతర అన్ని రకాల షాపులను మూసి వేయాలని ఆమె ఆదేశించారు.

కౌంటింగ్ హాళ్లలో ఫోన్ల నిషేధం

కర్నూలు(సెంట్రల్): కౌంటింగ్ హాళ్లలోకి సిబ్బంది, ఏజెంట్లు ఫోన్‌లు తీసుకెళ్లడానికి వీలు లేదని జనరల్ అబ్జర్వర్ జాఫర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలసి ఆర్‌యూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. సిబ్బంది, ఏజెంట్ల ఫోన్ల కోసం ప్రతి కౌంటింగ్ హాలులో మొబైల్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. సిబ్బంది, ఏజెంట్లకు వేర్వేరుగా భోజన వసతిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అ యితే ప్రతి కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి భోజన వసతి కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన వర్సిటీలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి భద్రత పరంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్వోలు భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, రామునాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, టీడ్కో ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్నం 3.30 గంటలలోపే ఫలితాలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పాణ్యం తప్ప మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఫలితాలు మధ్యాహ్నం 3.30 గంటల్లోపు వెల్లడవుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. పాణ్యం మాత్రం 26 రౌండ్లు ఉండడంతో సాయంత్రం 5.30 గంటలకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామని, మైక్రో అబ్జర్వర్లకు మూడో తేదీన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.



కౌంటింగ్ హాళ్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఇతర అధికారులు

ప్రతి ఫ్లోర్‌లో అగ్నిప్రమాదాల నివారణ కిట్లు

రాయలసీమ యూనివర్సిటీలో ప్రతి ఫ్లోర్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఎమర్జెన్సీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆదివారం ఆమె ఆర్‌యూలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. ముందుగా కంట్రోల్ రూమ్‌లో లైవ్‌ఫీడ్‌ను పరిశీలించి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసే ఎమర్జెన్సీ కిట్ల సైన్ బోర్డులను కూడా పెట్టాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగారజును ఆదేశించారు. ప్రతి మూడు బ్లాక్‌లకు ఒక్క ఫైర్ సేఫ్టీ అధికారిని నియమించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర వైద్యం కోసం మూడు బ్లాక్‌లకు కలిపి ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ నేతృత్వంలో అబ్జర్వర్లు జాఫర్, మీర్ తారిఖ్ అలీ సమయంలో కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయింది. వీరికి సోమవారం లేదంటే మంగళవారం ఉదయం 5.30 గంటలకు మూడో ర్యాండమైజేష్ ప్రక్రియ ద్వారా టేబుళ్లకు కేటాయిస్తార. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ...కౌంటింగ్ ఏజెంట్లు కేంద్రాల్లో ఏమైనా అవాంతరాలు సృష్టిస్తే వారిని నియంత్రించడానికి సివిల్ డ్రస్సులో ఉండే మార్షల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

బాలికల భవితకు భరోసా

- కేజీబీవీల్లో ప్రవేశాలకు పెరుగుతున్న డిమాండ్
- గతేడాది 1,040 సీట్లకు 3,650 దరఖాస్తులు
- ఈ ఏడాది వచ్చిన దరఖాస్తులు 5,258
- మొదటి విడతలో 983 మందికి ప్రవేశం
- మిగిలిన సీట్లు రెండో విడతలో కేటాయింపు



ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యను బోధిస్తున్న దృశ్యం(ఫైల్)

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీలు) విద్యార్థినులకు చక్కటి భవిష్యత్‌ను ఇస్తున్నాయి. దీంతో ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. ఈ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంలో చదువు చెబుతున్నారు. విశాలమైన భవనాలు, అన్ని రకాల సదుపాయాలు ఉండటం, అద్భుతమైన ఫలితాలు వస్తుండటంతో కేజీబీవీల్లో చేరేందుకు ఎక్కువ మంది బాలికలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 26 కస్తూర్బా స్కూళ్లు ఉండగా.. 6వ తరగతితో 1,040 సీట్లు ఏటా భర్తీ చేస్తున్నారు. ఈ సీట్ల కోసం ఆన్‌లైన్‌లో ఈ ఏడాది 5,258 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. తల్లిందండ్రులు లేని వారికి, చదువు మధ్యలో ఆపేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆ తరువాత మిగిలిన వారికి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మొదటి విడతలోనే 1040 సీట్లు కేటాయించారు. ఇందులో 983 మంది సీట్లు పొంది స్కూళ్లలో రిపోర్ట్ చేసుకోగా, మిగిలిన సీట్లకు సైతం రెండో విడతలోనే కేటాయించారు.

అన్ని రకాల సదుపాయాలు

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యను అందిస్తున్నారు. ఈ స్కూళ్ళలో వృత్తి విద్య కోర్సులు కూడా ఉన్నాయి. ఒక్కో తరగతిలో 40 సీట్ల చొప్పున ఉంటాయి. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఏఎన్‌ఎం, క్రీడలను ఆడించేందుకు పీఈటీలందరూ మహిళలే ఉంటారు. 2023–24 విద్యా సంవత్సరంలో 1,040 సీట్లకుగాను 3,650 దరఖాస్తులు వచ్చాయంటే ఈ స్కూళ్లలో చేరేందుకు ఎంత ఆసక్తి చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేస్తున్నారు. కేజీబీవీలకు మన బడి నాడు–నేడుతో కార్పొరేట్ విద్యా సంస్థలకు మించి మౌలిక సదుపాయాలు సమకూరాయి. ఇంగ్లిషు మీడియంలో చదివిన వారినే ఫ్యాకల్టీగా నియమించడం, అత్యంత భద్రతతో కూడిన వసతి సదుపాయాలు కల్పిస్తుండడంతో బాలికలు అత్యధిక శాతం మంది అక్కడ చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యాలయాల్లో సాధారణ విద్యతో పాటు కంప్యూటర్ విద్య, యోగాతో పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేజీబీవీల్లో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. టోఫెల్‌ను సైతం బోధిస్తున్నారు.



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

ప్రవేశాలకు డిమాండ్ ఉంది



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు భర్తీ చేశాం. అయితే భారీగా డిమాండ్ వస్తోంది. కేజీబీవీల్లో అందుతున్న నాణ్యమైన విద్య, వివిధ పరీక్షల్లో సాధిస్తున్న ఫలితాల వల్లే చాలా మంది విద్యార్థులు వీటిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది దాదాపు అన్ని కేసీబీవీల్లో సీట్లు భర్తీ అయ్యాయి. బాలికలకు భద్రత ఉండడంతో పాటు, మంచి టీచింగ్ స్టాఫ్ ఉండడం, మౌలిక సదుపాయాలు చక్కగా ఉంటున్నాయి. మిగిలిన హాస్టల్స్‌కు భిన్నంగా ఉంటుండడంతో ఎక్కువ మంది చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– కాగిత శామ్యూల్, డీఈఓ



మామిడి పండ్ల మధ్య జగన్నాథ్ బలదేవ్, సుభద్ర మూర్తులు

మామిడి పండ్ల ఉత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, మామిడి పండ్ల ఉత్సవం, నగర సంకీర్తన, శీల ప్రభు పాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివార్ల ముందు మామిడి పండ్లను రాశులుగా పోసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు గంగాధర్ ప్రభు సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఆలయాలను దర్శించడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ జప యజ్ఞాన్ని చేయించి హరినామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు (టౌన్): ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈనెల 9వ తేదీన వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారన్నారు. జగనన్న చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తాయనాప్నరు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన శ్రీరాములు

తుగ్గలి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మారెళ్లలో చోటు చేసుకుంది. తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన తలారి శ్రీరాములు(63)కు అదే గ్రామానికి చెందిన కొత్త కుర్వ హనుమంతుకు మధ్య ఏడాదికిపైగా మనస్పర్థలు ఉన్నాయి. ఈనెల1వ తేదీన గ్రామంలో ఊరి వాకిలి ముందున్న శ్రీరాములతో హనుమంతు, అతని తండ్రి పెద్దయ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో తనను కాళ్లతో తన్నారన్న అవమాన భారంతో శ్రీరాములు మనస్తాపానికి గురయ్యాడు. శ్రీరాములు కుమారుడు రాము ఆదివారం పొలానికి వెళుతుండగా తండ్రి మృతదేహం కనిపించింది. అవమానభారంతో శ్రీరాములు పురుగుల మందు తాగి మృతి చెందాడా లేక పాత కక్షతో హనుమంతు, పెద్దయ్యలే కొట్టి బలవంతంగా మందుతాపి చంపి ఉంటారా అనే అనుమానాన్ని మృతుడి కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య తలారి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

మద్యం దుకాణాలు బంద్

కర్నూలు: సార్వత్రిక ఎన్నిక ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూయించారు. జిల్లా వ్యాప్తంగా 82 మద్యం దుకాణాలు, 27 బార్‌లు, ఒక క్లబ్, 3 టూరిజం బార్‌లు, ఒక త్రీస్టార్ బార్ ఉన్నాయి. ఓట్ల లెక్కింపు నేపథ్యం, సోమ, మంగళవారం రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్ చేయాలన్న అధికారుల ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం రాత్రి వ్యాపారాలు ముగిసిన తర్వాత దుకాణాలు మూయించి సీలు వేశారు.

చెక్‌డ్యాంలోకి దూసుకెళ్లిన కారు

- నలుగురిని రక్షించిన స్థానికులు



గిరిగెట్లలో చెక్‌డ్యాంలో పడిపోయిన కారు

తుగ్గలి : మంత్రాలయం నుంచి బెంగళూరు వెళుతున్న ఓ కారు అదుపుతప్పి చెక్‌డ్యాంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన ఆదివారం తుగ్గలి మండలం గిరిగెట్ల సమీపంలో చోటు చేసుకుంది. చిక్‌మంగళూరుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు కారులో మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో అదుపుతప్పిన కారు గిరిగెట్ల వద్దనున్న గరిడివంక చెక్‌డ్యాం లోకి దూసుకెళ్లింది. ఇటీవల వర్షాలకు చెక్‌డ్యాంలోకి నీరు కూడా చేరింది. కారు పడిపోయిన ఘటనను చూసిన మేకల కాపరి, స్థానికులు బసయ్య, కాశీం, అంజి, చంద్రశేఖర్ నీటిలోకి దిగి కారు డోరు తెరిచి అందులో ఉన్న నలుగురుని రక్షించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. రక్షించిన వారిని ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.

ఆర్‌యూలో అడుగడుగునా నిఘా

- మూడంచల భద్రత..నాలుగంచల్లో తనిఖీలు
- ఒక్కో అసెంబ్లీ స్థానం పర్యవేక్షణకు ఒక్కో డీఎస్పీ
- అలజడులు సృష్టించేవారిని తరలించేందుకు లిఫ్టింగ్ పార్టీలు



రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం,



ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

కర్నూలు: కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. మూడంచల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. మొదటి దశలో సీఆర్‌పీఎఫ్ బలగాలు... రెండో దశలో ఏఆర్ పోలీసు బలగాలు... మూడో దశలో స్థానిక పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తోంది. ఫలితాలు వెలువడే ఈ నెల 4న జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు బలగాలు పూర్తి స్థాయిలో సమాయత్తమయ్యాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత మొదలు సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో పికెట్ల వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా అలజడులు సృష్టిస్తే అరెస్ట్ చేసి తరలించేందుకు ప్రత్యేకంగా లిఫ్టింగ్ పార్టీలను కూడా నియమించారు.

రూట్‌మ్యాప్ సిద్ధం...

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లో వచ్చి వెళ్లే మార్గాలు, వాహనాల పార్కింగ్ కోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. రెవెన్యూ, ఫైర్ విభాగాలతో పాటు సీఆర్‌పీఎఫ్, ఏఆర్, ఏపీఎస్పీ బలగాలను సమన్వయం చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నారు. కౌంటింగ్ ఏర్పాట్లలో పాల్గొంటున్న సిబ్బంది సైతం క్షుణ్ణంగా పరిశీలించాకే లోపలికి అనుమతిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది పసుపుల రోడ్డులోని రాయలసీమ యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రంలోకి బాయ్స్ హాస్టల్ మెయిన్‌గేట్ నుంచి వచ్చేలా ఏర్పాటు చేశారు. అలాగే మీడియాకు యూనివర్సిటీ మెయిన్ గేట్ నుంచి మీడియా రూమ్‌కు చేరుకునేలా రూట్ మ్యాప్ ఏర్పాటు చేశారు.

ఎస్పీ నేతృత్వంలో...

ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడిన తర్వాత జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణకాంత్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఇతర ప్రాంతాల వారు రాకుండా కట్టడి చేసేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు జరిగే ఆర్‌యూ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ హోదాల్లోని 2000 మంది సిబ్బందిని కేటాయించారు. ప్రతి హాలు వద్ద సీఐ, ఎస్‌ఐలతో పాటు పూర్తిస్థాయిలో పోలీసులు విధుల్లో ఉంటారు. ఆర్‌యూ ప్రధాన గేటు వద్ద తనిఖీలు చేసి అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు అనుమతి ఉన్నవారికి మాత్రమే అనుమతించేలా నాలుగంచల తనిఖీ విధానాన్ని ఏర్పాటు చేశారు.

నియోజకవర్గానికి ఓ డీఎస్పీ...

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక డీఎస్పీని నియమించారు. ఆయా నియోజకవర్గాల్లో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాల్లో పికెట్లు కొనసాగుతున్నాయి. ఇద్దరు అడిషనల్ ఎస్పీల నేతృత్వంలో 10 మంది డీఎస్పీలు, 51 మంది సీఐలు, 3 ఆర్‌ఐలు, 73 మంది ఎస్‌ఐలు, 9 మంది ఆర్‌ఎస్‌ఐలు, 1060 మంది సివిల్ పోలీసులు, 200 మంది ఏఆర్ పోలీసులు, 300 మంది హోంగార్డులు, కేంద్ర పోలీసు బలగాల్లోని ఎస్‌పీఎఫ్, ఎస్‌ఏఆర్ బలగాలతో పాటు కేరళ, సీఏపీఎఫ్ ఒక కంపెనీ, బీఎస్‌ఏఫ్‌కు సంబంధించి ఒక కంపెనీని బందోబస్తుకు నియమించారు.

188 సమస్యాత్మక గ్రామాలు...

జిల్లా వ్యాప్తంగా 188 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టాటిక్ పోలీస్ పికెట్లను కూడా ఏర్పాటు చేశారు. 91 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, పోలీసు రూట్‌మొబైల్స్‌తో కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. అలాగే 57 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి సున్నితమైన పికెట్‌లలో సీఐ, ఎస్‌ఐ నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్రంతో పాటు కీలక పట్టణాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ప్రణాళికను అమలు చేస్తున్నారు.

8 టీయర్ గ్యాస్ టీమ్‌లు...

అల్లరిమూకలు గొడవలకు దిగినా, రాళ్లు రువ్వినా కట్టడి చేయడానికి, పరిస్థితిని అదుపులోకి తేవడానికి అవసరమైన అన్ని రకాల సామగ్రితో కేంద్ర పోలీసు బలగాలను సిద్ధం చేశారు. ఇందుకోసం ఎనిమిది టియర్ గ్యాస్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. కర్నూలు కేంద్రంగా ప్రత్యేకంగా రెండు కంపెనీలను రిజర్వులో ఉంచారు. అవాంఛనీయ సంఘటనలు ఎక్కడ తలెత్తినా వారిని వెంటనే తరలిస్తారు. 67 రూట్ మొబైల్ టీమ్‌లను, 2 కంట్రోల్ రూమ్‌లు, 14 బాడీఓన్ కెమెరాలు, 9 వీడియో కెమెరాల ద్వారా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద నిఘా పెంచారు. 41 ప్రాంతాలను గుర్తించి కౌంటింగ్ రోజున పార్టీ కార్యాలయాలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద బందోబస్తుకు సిబ్బందిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా 31 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కర్నూలు శివారులోని ఆర్‌యూ పరిసర ప్రాంతాల్లో ఎనిమిది చెక్‌పోస్టుల ద్వారా తనిఖీ చేసి గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 48 షాడో పార్టీలు, 65 రాత్రి గస్తీ బృందాలను కూడా నియమించారు. సమస్యలు సృష్టించే అనుమానం ఉన్న సుమారు 7,900 మందిని బైండోవర్ చేశారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ, మండల కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ఆ రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

ప్రత్యేక పరిస్థితులు ఏర్పడవచ్చనే అనుమానంతో పోలీసులు కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత కల్పించే ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎవరైనా ఇబ్బందులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



ఫలితాలు వెలువడిన తర్వాత ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. హేళన చేయడం, రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడరాదు. యువత అల్లర్లు, గొడవల్లో పాల్గొని కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును పాడు చేసుకోవద్దు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం గుర్తింపు కార్డులు ఉన్నవారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుంది. – ఎస్పీ కృష్ణకాంత్

పంటల బీమాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త రాఘవేంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులకు పంటల బీమా పథకంపై అవగాహన కల్పించాలని నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ.. సాగు చేసిన పంటలకు బీమా చేసుకుంటే రక్షణ ఉంటుందన్నారు. వాతావరణంలో మార్పులు, అధిక వర్షాలు, తుపాన్‌లు, వడగండ్ల వానలు, బెట్ట పరిస్థితులు ఉత్పన్నమైన సమయంలో పంటల బీమా పథకం రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో బీమా మొత్తానికి 2 శాతం, రబీ సీజన్‌లో 1.50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లను ఆశ్రయిస్తారని, పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించి సహకరించాలని సూచించారు.

పాణ్యం కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ బిపుల్ సైకియా

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్ ఏర్పాట్లను ఆ నియోజకవర్గ అబ్జర్వర్ బిపుల్ సైకియా పరిశీలించారు. ఆదివారం ఆయన రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కౌంటింగ్, కంట్రోల్ రూమ్‌లు, భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. కౌంటింగ్, కంట్రోల్ రూమ్‌ల్లోని ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితులకు అనుగుణంగా కౌంటింగ్‌లో అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్‌ను చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ అబ్జర్వర్‌కు వివరించారు.

కోడిగుడ్ల లారీ బోల్తా

- గుడ్ల కోసం ఎగబడిన జనం



బోల్తా పడిన లారీ



గుడ్లను తీసుకెళ్తున్న జనం

గోస్పాడు: కర్నూలు – కడప జాతీయ రహదారిపై కానాలపల్లె మెట్ట వద్ద ఆదివారం తెల్లవారుజామున కోడిగుడ్ల లారీ బోల్తా పడింది. ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వైపు వస్తున్న కోడిగుడ్ల లారీని వెనుక వైపు నుంచి వస్తున్న బొగ్గులారీ వేగంగా ఢీకొనడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ భాస్కర్ గాయపడటంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కోడిగుడ్ల లారీ బోల్తా పడిన విషయం తెలుసుకున్న చుట్టు పక్కల ప్రజలు తరలివచ్చి గుడ్లను తీసుకెళ్లారు. లారీ బోల్తా పడిన సమయంలో సగం గుడ్లు పగిలిపోగా మిగతా గుడ్లను స్థానికులు ఎగబడి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మద్దిలేటి తెలిపారు.

ప్రజా జీవితాలపై రాజకీయ ప్రభావం



మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి.



సదస్సుకు హాజరైన మానసిక వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రజల జీవితాలపై రాజకీయాలు ప్రభావితం చూపుతున్నాయని ప్రీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సౌత్ జోన్ ఆధ్వర్యంలో కర్నూలు బ్రాంచ్ సహకారంతో నిర్వహిస్తున్న దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సు ఆదివారం ముగిసింది. రెండో రోజు నిర్వహించిన సైన్స్ సెషన్‌లో వివిధ మానసిక సమస్యల అంశాల గురించి బెంగళూరుకు చెందిన డాక్టర్ గీతా దేశాయ్, డాక్టర్ వీణా సత్యనారాయణ, మంగళగిరి ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ ఎ. విజయచంద్రారెడ్డి, తిరుచ్చికి చెందిన డాక్టర్ ఎస్. అరుణ్‌కుమార్, బెంగళూరుకు చెందిన డాక్టర్ జీవి. లక్ష్మీనరసింహ, వయనాడుకు చెందిన డాక్టర్ దయాల్ నారాయణ్, మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, మీడియా వల్ల ఓటరు మనస్తత్వం ఎలా మారుతుందనే అంశంపై డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పూర్వం నుంచి వివిధ రాజకీయ నాయకుల మనస్తత్వాల కారణంగా ప్రజలే ఇబ్బంది పడ్డారన్నారు. హిట్లర్ లాంటి నాయకులు తీసుకున్న నిర్ణయాలతో కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఆయా సందర్భాలు, సంఘటనల కారణంగా ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చిన నాయకులు తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలను తీవ్ర ప్రభావితం చేస్తాయన్నారు. ఇటీవల కొన్ని మీడియా సంస్థలు సైతం ఉన్నవీ లేనివీ ప్రసారం చేసి చూపి ఓటరు మనస్తత్వాన్ని ప్రభావితం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐపీఎస్ కర్నూలు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు, కార్యదర్శి డాక్టర్ కె. నాగిరెడ్డి, డాక్టర్ కె. హరిప్రసాద్, డాక్టర్ స్పృహృత్‌రెడ్డి, డాక్టర్ ఆర్. కిశోర్‌కుమార్, డాక్టర్ కలామ్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన వడ్ల వెంకటేశ్వర్లు కుమారుడు బాణాల హరి ప్రసాద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. స్థానిక స్టేషన్‌లో ఆదివారం నిందితుల అరెస్టును సీఐ మీడియాకు వివరించారు. పాత కక్షల నేపథ్యంలో బాణాల హరిప్రసాద్‌ను గత నెల 25వ తేదీన అదే గ్రామానికి చెందిన కొత్త గొల్ల వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల వెంకట సుబ్బయ్య, బీసన్న గారి చిన్న మద్దయ్య రాళ్లు, కట్టెలు, పిడి బాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. తీవ్రగాయాల పాలైన బాణాల హరి ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి వడ్ల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్త గొల్ల వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల వెంకట సుబ్బయ్య, బీసన్న గారి చిన్న మద్దయ్యలు సీతారామాపురం మెట్ట వద్ద ఆదివారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద హత్యకు ఉపయోగించిన కట్టె, రాయి, పిడి బాకును స్వాధీనం చేసుకొని డోన్ కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి. సమావేశంలో , ఎస్‌ఐ శివ శంకర్ నాయక్, సిబ్బంది తిరుపాల్ నాయక్, సురేష్, రాజునాయక్, దస్తగిరి, గురుబాబు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్‌ఐ శివ శంకర్ నాయక్




శ్రీమఠం ప్రాంగణంలో భక్తులు



కచేరి చేస్తున్న చిన్నారులు

శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయం భక్తుల సందడితో కళకళలాడింది. ఆదివారం, వేసవి సెలవులు కలసి రావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కర్ణాటక, ఆంధ్ర తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో పురవీధులు కిక్కిరిశాయి. రాఘవేంద్ర మూల బృందావన దర్శనానికి రెండు గంటల పాటు సమయం పట్టింది. మంచాలమ్మ దర్శన క్యూలైన్, పరిమళ ప్రసాదం, అన్నపూర్ణ భోజనశాల, హోటళ్లు, వ్యాపార దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ మఠం ప్రవచన మందిరంలో కర్ణాటకకు చెందిన బాలికలతో సంగీత విభావరి ఏర్పాటు చేశారు.



శివయ్య శిగలో ఆదిత్యుడి అద్భుతం

సాధారణంగా గరళకంఠుడి శిగలో చంద్రుడు కనిపిస్తాడు. అయితే ఆదివారం మహానంది ఆలయంలో అద్భుతం చోటుచేసుకుంది. మహానంది ఆలయ గోపురానికి సమీపంలోని ధ్వజస్తంభంపై ఆదిత్యుడు చంద్రుడిలా కనిపించాడు. భానుడి చుట్టూ రంగు రంగుల వలయం శోభితంగా దర్శనమిచ్చింది. సూర్యుడి చుట్టూ ఇలా ఏర్పడటాన్ని హాలో అంటారని శాస్త్ర, సాంకేతిక నిపుణులు తెలిపారు. మహానంది ఆలయంలోని ధ్వజస్తంభం పైన కనిపించిన ఈ సుందర దృశ్యం కనువిందు చేసింది. – మహానంది

యువకుడి బలవన్మరణం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో పేడ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన రాజుపాలెం జయలక్ష్మీకి ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు రాజుపాలెం మహేంద్ర బాబు(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మద్యాని బానిస కావడంతో తల్లి గత నెల 26న మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మహేంద్ర బాబు మద్యంలో పేడ మందును కలుపుకుని తాగాడు. ఆవిషయాన్ని తల్లికి తెలిపాడు. హుటాటిన జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ కోలుకోలేక జూన్ 1వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతిని తల్లి రాజుపాలెం జయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ రెడ్డి తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



మృతి చెందిన షాలిమియ్యా

నందికొట్కూరు: పిడుగు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నందికొట్కూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బైరెడ్డి నగర్‌కు చెందిన షాలుమియ్యా(52) సాయంత్రం బర్వామికి వెళ్లాడు. వర్షం ఆగిన తర్వాత కూడా ఎంత సేపటికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య అలీంబీ ఆరా తీయగా మద్యం దుకాణం వద్ద విగతజీవిగా కనిపించాడు. పిడుగు పడటంతో తన భర్త మృతి చెందాడని తెలుసుకున్న అలీంబీ బోరున విలపించింది. షాలుమియ్యా పాత ఇనుప దుకాణంలో దినసరి కూలీగా పని చేసేవాడు. ఈయనకు ఒక కుమారు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.